## మీడియా పాయింట్

### రైతుకు భరోసా ఏది ?



ఓట్‌ఆన్ బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా లేదు. వ్యవసాయానికి రూ.7,085 వేల కోట్లు కోత విధించడంతో రైతాంగం సంక్షోభం ఎదుర్కొంటది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, కౌలు రైతులకు ఏటా రూ.15వేల పంట పెట్టుబడి సాయం ఇస్తామన్నది. బడ్జెట్‌లో అదేం కనిపించలేదు. రుణమాఫీకి నిధులు కేటాయించ లేదు. వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12 వేల సాయం, వరికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ బడ్జెట్‌లో ప్రస్తావన లేకపోవడం దారుణం.

**-నామా నాగేశ్వర్‌రావు, బీఆర్‌ఎస్ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం ఎంపీ**

### ప్రజలు అన్ని గమనిస్తున్నారు



అంకెల గారడీతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్ని మోసం చేస్తున్నది. సామాన్యులకు తెలియని విషయంలో అబద్ధాలు ఆడి మోసాలు చేస్తామంటే కుదదు. ప్రజలు అన్ని గమనిస్తారు. గ్యారెంటీలకు కేటాయించిన రూ.53 వేల కోట్లలో రూ.30 వేల కోట్ల ఆదాయం వచ్చే అవకామే లేదు. వ్యవసాయరంగానికి 7 వేల కోట్లు తగ్గించారు. రైతుభరోసా, రుణమాఫీని ఏ విధంగా అమలు చేస్తుంది? ధాన్యానికి బోనస్ విషయాన్ని కూడా ప్రస్తావించలేదు.

**- మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య**

### గత ప్రభుత్వంపై విమర్శలకే పరిమితం



గత ప్రభుత్వంపై విమర్శలు చేసేందుకు అన్నట్టు ప్రస్తుత సమావేశాలు నడుస్తున్నాయి. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో మహిళా సంక్షేమం కోసం కేటాయింపులు, ప్రతిపాదనలు లేవు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల ప్రస్తావనే ఈ బడ్జెట్‌లో లేదు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని మేమూ హర్షిస్తున్నాం. అదేసమయంలో ఆ పథకంతో ఇబ్బందులు పడుతున్న ఆటో కార్మికులకు న్యాయం చేయాలి.

**- సత్యవతి రాథోడ్, మాజీ మంత్రి**

### ఇది నేమ్ చేంజింగ్ ప్రభుత్వం



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రగతి గేర్లను మార్చకుండా కేవలం పాత పేర్లను మార్చి కొత్త పేర్లు పెట్టేందుకే పరిమితం అవుతున్నది. ఆడబిడ్డల వివాహాలకు కేసీఆర్ ప్రభుత్వం రూ.లక్ష చొప్పున సాయం అందించేది. దానికి అదనంగా తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. బడ్జెట్‌లో కనీసం దాని గురించి ప్రస్తావించలేదు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు బడ్జెట్‌లో చోటే లేదు. పేర్లు, చిహ్నాలు మార్చడానికి ఇచ్చిన ప్రాధాన్యత హామీల అమలుకు కేటాయింపులు చేపట్టడానికి ప్రభుత్వం ఇవ్వలేదు. కేసీఆర్ హయాంలో ఒక్క నిమిషం కూడా విద్యుత్తు కోత లేకుండేది. ఇప్పుడు హైదరాబాద్ నగరంలో రోజూ 3 నుంచి 4 గంటల పాటు కరెంటు పోతున్నది.

**-కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్సీ**

### మన సంస్కృతిని అవమానపర్చేలా సీఎం మాటలు



తెలంగాణ చరిత్ర, సంస్కృతిని అవమానపర్చేలా సీఎం మాట్లాడుతున్నారు. గత ప్రభుత్వ ఆనవాళ్లు లేకుండా చేస్తానని నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నారు. చార్మినార్, కాకతీయతోరణం తెలంగాణ వారసత్వ చిహ్నాలు. వాటిని తొలగిస్తామనడం దారుణం. మన రాజముద్రలో మూడు సింహాలు ఉంటాయి. అయితే వాటినీ తొలగిస్తారా? కేసీఆర్ హయాంలో మిషన్ కాకతీయ ద్వారా పూడిక తీసిన చెరువులను మళ్లీ పూడ్చుతారా? తెలంగాణ తల్లికి కిరీటం ఉంటే తప్పేంటి? దేవతలా ఉండటానికి కిరీటం పెట్టారు. ఎర్రకోటపై ఎందరో కాంగ్రెస్ ప్రధానులు జాతీయ జెండాను ఎగరవేశారు. రాచరిక గుర్తులున్నాయని ప్రధాని ఎర్రకోటపై జెండా ఎగురవేయవద్దా?

**- దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్సీ**

### బీసీలను విస్మరించిన బడ్జెట్



బడ్జెట్‌లో బీసీలకు తగిన ప్రాధాన్యం కల్పించలేదు. రాష్ట్ర జనాభాలో 50 శాతానికిపైగా ఉన్న బీసీలకు కేవలం రూ.8 వేల కోట్లు కేటాయించడం దారుణం. కుల వృత్తులకు కేటాయింపులు చేయకపోవడం వల్ల అవి కునారిల్లిపోయే పరిస్థితి నెలకొన్నది.

**- బస్వరాజు సారయ్య, ఎమ్మెల్సీ**

### అంకెల గారడీ బడ్జెట్



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీనే. కాంగ్రెస్ మ్యానిఫెస్టో అమలు కోసం ఏమి చేస్తారో చెప్పలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని తిట్టడానికే ఎక్కువ పేజీలు కేటాయించారు. అంకెలు మార్చి, ఆంక్షలు పెట్టి అన్నదాత నోరు కొట్టేలా ఉంది. రైతుల కోసం వరంగల్‌లో కాంగ్రెస్ ఇచ్చిన రైతు డిక్లరేషన్ చిత్తు కాగితమేనని ఈ బడ్జెట్ చెప్తున్నది. కాంగ్రెస్ రైతులను మోసం చేసింది. బీసీ డిక్లరేషన్‌ను కూడా చెత్తబుట్టలో వేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు భేషరతు క్షమాపణ చెప్పాలి.

**- తాతా మధు, ఎమ్మెల్సీ**

### వాస్తవాలకు దగ్గరగా ఉంది



బడ్జెట్ వాస్తవానికి చాలా దగ్గరగా ఉన్నది. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికంగా బడ్జెట్ పెంచి చూపించి ఖర్చు చేయలేదు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీలకూ బడ్జెట్ కేటాయించింది. వాస్తవంగా సాగు చేస్తున్న భూమికి మాత్రమే రైతు బంధు ఇవ్వాలి. ధరణికి మార్పులు చేయాల్సిన అవసరం ఉన్నది. గ్రామాల్లో నెలకొన్న మంచి నీటి సమస్యను తీర్చాలి. ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంచడం సంతోషకరం.

**- సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

### ఇదొక రాజకీయ ప్రసంగం



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఓ రాజకీయ ప్రసంగంలా ఉంది. ఒక్కసారిగా అన్ని వర్గాలను నిరాశలోకి నెట్టింది. కేసీఆర్ పాలనలో అవినీతిని ఎండగట్టే ప్రసంగంలా మాత్రమే ఉంది. కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టలేదని మీరు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశ పెట్టారా? దీన్నిబట్టే ప్రజల సంక్షేమం కాంగ్రెస్ ప్రణాళిక ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఇందిరమ్మ ఇండ్లకు రూ.20 వేల కోట్లు అవసరం ఉంటే రూ.7 వేల కోట్లే ఎలా కేటాయిస్తారు? 30 లక్షల మంది నిరుద్యోగ యువతకు భృతి ఎప్పటి నుంచి ఇస్తారో చెప్పాలి.

**- మహేశ్వర్‌రెడ్డి, నిర్మల్ బీజేపీ ఎమ్మెల్యే**

### బడ్జెట్‌లో రుణమాఫీ ప్రస్తావనేది?



కాంగ్రెస్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సొంత డబ్బా మినహా ఏమీ లేదు. బడ్జెట్లో రూ.2 లక్షల రైతు రుణమాఫీ ప్రస్తావన ఎందుకు లేదు? గత ప్రభుత్వంలాగే కాంగ్రెస్ కూడా బీసీలకు చేసిన మోసం చేస్తున్నది. గొల్ల కురుమలకు గొర్లు ఎప్పటి నుంచి ఇస్తారో చెప్పాలి. ఈ బడ్జెట్ కేటాయింపులు ఎవరికీ న్యాయం జరిగేలా లేవు.

**- పాయల్ శంకర్, ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే**

### మా బడ్జెట్‌లో పారదర్శకత



గత ప్రభుత్వం జిమ్మిక్కుల బడ్జెట్ ప్రవేశ పెట్టేది. మా ప్రభుత్వ బడ్జెట్ పారదర్శకంగా ఉన్నది. ప్రత్యేక ప్రణాళికతో మూసీ నది సుందరీకరణ జరుగుతుంది. గురుకుల విద్యార్థులకు శాశ్వత భవనాలు కేటాయించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఆరోగ్యశ్రీకి అధికంగా నిధులు కేటాయించాం. గత ప్రభుత్వం చేసిన తప్పులను కాంగ్రెస్ చేయబోదు. దళితబంధు స్థానంలో కొత్త పథకాలు తీసుకొస్తాం.

**- యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే, మహబూబ్‌నగర్**

### ఆరు గ్యారెంటీలకే అధిక నిధులు



కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు అధిక శాతం నిధులు కేటాయించింది. ఈ బడ్జెట్లో గ్రామ పంచాయతీలకు, అర్బన్ డెవలప్మెంటుకు, విద్య, వైద్య రంగానికి ప్రాధాన్యం ఇచ్చారు. పంచాయతీరాజ్‌కు కేటాయించిన నిధులతో పల్లెలను సుందరంగా తీర్చిదిద్దుకోవచ్చు.

**- రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి**

## ● బాదేపల్లి.. పోటెత్తిన పల్లి



మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ శనివారం ఇలా పల్లి పంటతో నిండిపోయింది. రైతులు భారీగా పల్లికాయను విక్రయించడానికి తీసుకొచ్చారు. దీంతో మార్కెట్ యార్డు పంట ఉత్పత్తులతో నిండుగా కనిపించింది.

# పెంపుడు జంతువులకూ బీమా!

- అందుబాటులోకి తెచ్చిన కంపెనీలు
- బీమా కుక్క, పిల్లి ప్రవేశ వయస్సు 3 నెలల నుంచి 7 సంవత్సరాలు
- నిష్క్రమణ వయస్సు 6-10 ఏండ్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): పెంపుడు జంతువులను పెంచుకొనే అభిరుచి ప్రపంచవ్యాప్తంగా ప్రజల్లో వేగంగా పెరుగుతున్నది. భారతదేశంలో ముఖ్యంగా కుక్కలను ఎక్కువగా పెంచుకుంటున్నారు. వాటిని కుటుంబసభ్యులుగా చూసుకుంటున్నారు. లక్షలు వెచ్చించి విదేశీ బ్రీడ్ కుక్కలను సాకుతున్నారు. వాటి సంరక్షణ, వైద్యం, ఆహారం కోసం లక్షలు వెచ్చిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రముఖ బీమా కంపెనీలు పెంపుడు జంతువులకు కూడా బీమా కల్పిస్తున్నాయి. అదే పెట్ ఇన్సూరెన్స్. కుక్క ఎవరికైనా హాని కలిగిస్తే పరిహారం, కుక్కను ఎత్తుకెళ్లడం, వైద్య చికిత్స, మరణం వంటి వాటిని కూడా బీమా కింద క్లెయిమ్ చేసుకోవచ్చు.



**పెట్ ఇన్సూరెన్స్ అంటే ..**

కుక్కలు, పిల్లులు, కుందేళ్లు వంటి చిన్న జాతి పెంపుడు జంతువులకు ఆరోగ్య రక్షణ కల్పించే ప్రత్యేక బీమా. మన కుటుంబసభ్యులకు చేసినట్టే.. పెంపుడు జంతువులకు కూడా బీమా చేయవచ్చు. ఇందులో పెట్స్ చికిత్స ఖర్చులతోపాటు ఇతరాలు కవర్ అవుతాయి.

**వాటికి బీమా ఎందుకు అవసరం?**

జంతు ప్రేమికులు తమ పెట్స్ కోసం సాలీన పెద్దమొత్తంలో ఖర్చు చేస్తారు. ఇందులో టీకాలు, వైద్య ఖర్చులు, ఇతరాలు ఉంటాయి. ఒక అంచనా ప్రకారం.. ఒక పెంపుడు కుక్క సంరక్షణ కోసం ఏటా రూ.10 వేల నుంచి రూ.54 వేల ఖర్చు చేస్తారు. జంతు బీమా ద్వారా ఈ ఖర్చులను కవర్ చేయవచ్చు.

**నిబంధనలు, షరతులు..**

భారతదేశంలో బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్, న్యూ ఇండియా అస్యూరెన్స్, ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ జంతు బీమాను అందిస్తున్నాయి. బీమా పాలసీకి సంబంధించి ఒక్కో కంపెనీ నిబంధనలు వేర్వేరుగా ఉంటాయి. policybazaar.comలో అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. Bajaj Allianz General Insurance Company Limited పెంపుడు జంతువుల బీమా కుక్క లేదా పిల్లి ప్రవేశ వయస్సు 3 నెలల నుంచి 7 సంవత్సరాల వరకు ఉండాలి. నిష్క్రమణ వయస్సు 6 నుంచి 10 సంవత్సరాల వరకు ఉండాలి.

### ఏయే ఖర్చులు బీమా పరిధిలోకి వస్తాయి?

బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ కస్టమర్ సపోర్ట్‌తో సంభాషణ ఆధారంగా.. పెట్ ఇన్సూరెన్స్‌లో కుక్క చికిత్స సమయంలో శస్త్రచికిత్స, మరణాల ప్రయోజనం, థర్డ్ పార్టీ లయబిలిటీ కవర్.. అంటే మీ కుక్క ఎవరికైనా హాని కలిగిస్తే పరిహారం, కుక్కను కోల్పోవడం, దొంగతనం చేయడం వంటివి ఉంటాయి. ఆ సమయంలో పాలసీని మీరు క్లెయిమ్ చేసుకోవచ్చు. మరికొన్ని సౌకర్యాలు కావాలంటే అదనపు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఒక సంవత్సరం ప్రాథమిక ఆరోగ్య బీమా పాలసీ కోసం మీరు ప్రీమియంగా రూ.4 వేలు చెల్లించాలి. డిస్కౌంట్ తర్వాత, మీరు ఈ పాలసీని రూ.2వేల నుంచి రూ.2,500కి పొందవచ్చు. కుక్కల బీమా కోసం ప్రీమియం వాటి జాతులను బట్టి మారుతూ ఉంటుంది.

## తిట్టడం తప్ప.. వాగ్దానాల మాటే లేదు



గత ప్రభుత్వాన్ని తిట్టడానికే బడ్జెట్‌లో ఎక్కువ పేజీలు కేటాయించారు తప్ప ఎన్నికల వాగ్దానాల కోసం చెప్పిందేమీ లేదు. వ్యవసాయానికి కేవలం రూ.19,746 కోట్లు కేటాయించారు. మరి రైతుభరోసా, రుణమాఫీ, పంటబీమా, రైతుబీమా, వడ్డీలేని పంటరుణాలు అమలు పరిస్థితేంటి? కౌలు రైతులకు, రైతు కూలీలకు భరోసా నీటిమీద రాతలేనా? ఎన్నికల్లోచ్చిన హామీలను మరిచి రైతులకు కాంగ్రెస్ ధోఖా చేసింది. కాంగ్రెస్ ఇచ్చిన రైతు డిక్లరేషన్, బీసీ డిక్లరేషన్ చిత్తు కాగితాలేనని కాంగ్రెస్ బడ్జెట్ చూస్తే అర్థం అవుతుంది. గతంలో దశాబ్దాలుగా ఎన్నికలు నిర్వహించని చరిత్ర కాంగ్రెస్‌ది. ఈ దఫా కూడా అలాగే మోసం చేస్తుందా? ప్రభుత్వ దవాఖానల బలోపేతానికి నిధులు ఎందుకు కేటాయించలేదు.

**- కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు**

### మైనార్టీలకు నిధులు ఏవి?



మైనార్టీలకు రూ.4 వేల కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చిన విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. మైనార్టీలకు సరైన నిధులు కేటాయించకపోవడం దారుణం. మైనార్టీలకు కేటాయించిన రూ.2262 కోట్లు మొత్తం బడ్జెట్‌లో 0.82 శాతం మాత్రమే. మైనార్టీలు బీఆర్‌ఎస్‌కు ఓటు వేసినందుకు ఆ వర్గానికి నిధుల కేటాయింపు తగ్గించారు.

**- బీఆర్‌ఎస్ మైనార్టీ నేత సోహెయిల్**

### బీసీలకు బడ్జెట్‌లో మొండిచేయి

ప్రభుత్వం బడ్జెట్‌లో బీసీలను పూర్తిగా విస్మరించింది. బలహీనవర్గాల సంక్షేమంపట్ల పట్టింపులేనట్టు వ్యవహరించింది. ఏడాదికి రూ.20 వేల కోట్ల చొప్పున ఐదేండ్లల్లో లక్షకోట్లు కేటాయిస్తామని పేర్కొన్న ప్రభుత్వం కేవలం రూ.8 వేల కోట్లు కేటాయించడం బీసీల పట్ల వివక్షనే. బీసీ ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం.. బీసీలను నిర్లక్ష్యం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నాం.

**-బీసీ టీచర్స్ అసోసియేషన్ (బీసీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు**

# కాంగ్రెస్‌లో 'పార్లమెంటు' పైరవీలు

- ఎంపీ టికెట్ కోసం నేతల పోటాపోటీ
- నాగర్‌కర్నూల్‌లో 26 మంది ఆశావహులు
- పోటీలో మల్లు రవి, సంపత్‌కుమార్
- జిల్లా కేంద్రంలో వెలసిన పోస్టర్లు
- కాంగ్రెస్ శ్రేణుల్లో గందరగోళం









నాగర్‌కర్నూల్‌లో మాజీ ఎంపీ మల్లు రవి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ పేరుతో వెలిసిన పోస్టర్, హోర్డింగ్

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో పార్లమెంటు టికెట్ కుంపట్లు అప్పుడే రాజుకున్నాయి. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో టికెట్ కోసం మహబూబ్‌నగర్ నుంచి నలుగురు మాత్రమే దరఖాస్తు చేసుకోగా, ఎస్సీ రిజర్వుడు స్థానమైన నాగర్‌కర్నూల్ నుంచి మాత్రం ఏకంగా 26 మంది ముందుకొచ్చారు. వీరిలో రాష్ట్రస్థాయిలో కీలక దళిత నేతలైన ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి డాక్టర్ మల్లురవి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, మాజీ ఎంపీ డాక్టర్ మందా జగన్నాథం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చారకొండ వెంకటేశ్ ఉండడంతో వీరి మధ్య పోటీ తీవ్రమైంది. టికెట్ల ఖరారు కీలక దశకు చేరుకోవడంతో ఇరువురు నేతలు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ, పోస్టర్లు హాట్ టాపిక్‌గా మారాయి. టికెట్ కోసం పోటీని బహిర్గతం చేయడంతో రాబోయే రోజుల్లో ఈ అంశం కాంగ్రెస్‌లో మంటలను మరింత రాజేస్తుందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో నెలకొన్నది.

**టికెట్ తమకేనంటూ ప్రచారం**

నాగర్‌కర్నూలు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న 26 మందీ ఎవరికీ వారే అప్పుడే పైరవీలు మొదలుపెట్టారు. టికెట్ తమకేనంటూ తమ వర్గీయుల ద్వారా ప్రచారం చేయించుకుంటున్నారు. మల్లురవి, సంపత్ కుమార్ పోస్టర్లు, హోర్డింగులు రాత్రికి రాత్రే ఆయా నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున పుట్టుకురావడం పార్టీలో మరింత కాకరేపింది.కందనూలు అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమంటూ సంపత్ పేరిట హోర్డింగ్స్ దర్శనమిచ్చాయి. పార్టీశ్రేణులను ఇది మరింత గందరగోళానికి గురిచేసింది. టికెట్ ఆశావహులందరూ పార్టీలో కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరిలో మల్లు రవి తాను పోటీ ఉంటానని ఇప్పటికే ప్రకటించారు. ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పదవి ఇందుకు అడ్డు కాబోదని స్పష్టం చేశారు. సంపత్ కూడా ఏఐసీసీలో కీలక నేతగా ఉన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వీరిద్దరూ రేవంత్‌రెడ్డికి అండగా నిలిచారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరిన మందా జగన్నాథం నాలుగుసార్లు ఎంపీగా పనిచేశారు. మరోనేత చారకొండ వెంకటేశ్ సైతం పోటీలో ఉన్నానని ఇప్పటికే స్పష్టం చేశారు. ఆయనకు టికెట్ ఖరారైందంటూ సోషల్ మీడియాలో ప్రచారం కూడా జరుగుతున్నది. ఎవరికి వారే టికెట్ తమకేనని ప్రకటించుకోవడంతో కార్యకర్తలు గందరగోళంలో పడిపోయారు. టికెట్ ఎవరికి వస్తుందో? ఎవరికి మద్దతు ఇవ్వాలో? తెలియక అయోమయానికి గురవుతున్నారు.

**బలంగా బీఆర్‌ఎస్**

ఇటీవల శాసనసభ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని అలంపూర్, జోగుళాంబ గద్వాల అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ గెలుపొందగా, నాగర్‌కర్నూల్‌లో స్వల్ప తేడాతో ఓడిపోయింది. వనపర్తి, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేటలోనూ బీఆర్‌ఎస్ స్థానికంగా బలీయంగానే ఉన్నది. నాగర్‌కర్నూల్‌లో ప్రస్తుతం బీఆర్‌ఎస్ ఎంపీ ప్రాతినిధ్యం వహిస్తుండగా సిట్టింగ్ స్థానం నిలబెట్టుకొనేందుకు ఇప్పటికే హైదరాబాద్‌లో మాజీమంత్రి హరీశ్‌రావు సమక్షంలో పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. లోక్‌సభ ఎన్నికల్లో గెలుపుపై మార్గనిర్దేశనం చేశారు. అంతర్గత సర్వేల్లోనూ బీఆర్‌ఎస్ తిరిగి గెలుపొందుతుందని స్పష్టమైంది. దీంతో బలమైన బీఆర్‌ఎస్‌ను ఎదుర్కోవడం గ్రూపు తగాదాల్లో మునిగిపోయిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో చేదు ఫలితాలను చవి చూడవచ్చనే అభిప్రాయం వినిపిస్తోంది.

# ఈ బాలికలు.. విధి వంచితులు

- *ఎనిమిదేండ్ల క్రితం అమ్మ.. మొన్న నాన్న మృతి*
- *అనాథలైన ఇద్దరు ఆడపిల్లలు*
- *ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు*



*కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెంకట్రావుపల్లిలోని ఇంటి వద్ద పావని- పరశురాములు కూతుర్లు అక్షర, కృషిత*





*పావని- పరశురాములు(ఫైల్)*

*రామడుగు (చొప్పదండి) ఫిబ్రవరి 10:* అప్పుడప్పుడే ఊహ తెలుస్తున్న వయసులో అమ్మ కన్నుమూసింది. తల్లిలోటు తెలియకుండా అన్నీ తానై పెంచి పెద్ద చేస్తున్న నాన్న ఇటీవల అనారోగ్యంతో తనువుచాలించాడు. తల్లిదండ్రుల మరణంతో ఆ ఇద్దరు ఆడపిల్లలు అనాథలుగా మారారు. అమ్మానాన్న లేనిలోకంలో బతికేదెట్లా? చదువులను సాగించేదెట్లా? అన్ని దీనంగా రోదిస్తున్నారు. దాతలు దయతలిచి ఆపన్నహస్తం అందించాలని వేడుకుంటున్నారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెంకట్రావుపల్లికి చెందిన దైవాల పరశురాములు-పావని దంపతులు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు అక్షర, కృషిత. వీరిది నిరుపేద కుటుంబం. కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఎనిమిదేండ్ల కిందట పావని మంచంపట్టింది. కొంత కాలం తర్వాత తీవ్ర అనారోగ్యంతో కన్నుమూసింది. అప్పటికి ఈ ఇద్దరు పిల్లల వయసు ఆరేండ్లలోపే. తల్లి మరణంతో తండ్రి పరశురాములు పిల్లలకు అన్నీ తానై ఆలనా పాలనా చూసుకున్నాడు. తర్వాత ఆ బాలికలను రామడుగు కస్తూర్బా బాలికల విద్యాలయంలో చేర్పించాడు. అక్షర(14) తొమ్మిది, కృషిత(12) ఎనిమిదో తరగతి చదువుతున్నారు. కాగా పరశురాములు కొన్ని రోజులుగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ గతనెల 31న తనువుచాలించగా, ఆ ఇద్దరు బిడ్డలు దిక్కుతోచని స్థితిలో చిక్కుకున్నారు. నిలువనీడలేని పరిస్థితుల్లో దాతలు ఆపన్నహస్తం అందించాలని దీనంగా వేడుకుంటున్నారు. సాయం చేయాల్సిన వారు 9849262491 ఫోన్ నంబర్‌కు ఫోన్‌పే, గూగుల్ పే చేయాలని కోరుతున్నారు.

## ఇజ్రాయిల్ దాడుల్లో 44 మంది పాలస్తీనియన్ల మృతి

- మృతుల్లో డజన్‌కు పైగా చిన్నారులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: దక్షిణ గాజా నగరం రఫాలో శనివారం ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడుల్లో 44మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. మృతుల్లో డజన్‌కు పైగా చిన్నారులున్నారు. రఫా పట్టణంపై దాడికి ఇజ్రాయిల్ సిద్ధమైందని, అక్కడ కిక్కిరిసిన జనాభాను బయటకు పంపించేందుకు ప్రణాళికను తయారు చేయాలని తాను సైన్యాన్ని అప్రమత్తం చేసినట్టు ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు శుక్రవారమే తెలిపారు. చాలా మంది ఇజ్రాయిల్ ఆదేశాలను పాటించినప్పటికీ మూడింట రెండొంతుల మంది రఫాలోనే ఉండిపోయారు. పాలస్తీనియన్లను వారి భూమి నుంచి వెళ్లగొట్టడమే ఇజ్రాయిల్ లక్ష్యంగా పెట్టుకున్నదని ఈజిప్టు విదేశాంగ మంత్రి సమేష్ షౌక్రి తెలిపారు.